జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 107 ॥ శుక్రవారం ॥ 11-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

11 సెప్టెంబర్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:18 తిథి అమావాస్య ఉ. 8:58 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) మ. 1:15 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం సాధ్య సా. 4:58 వరకు కరణం నాగవ ఉ. 8:58 వరకు స్తుఘ్నమ రా. 8:21 వరకు వర్జ్యం రా. 8:22 నుండి రా. 9:57 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:22 వరకు మ. 12:37 నుండి మ. 1:25 వరకు రాహుకాలం ఉ. 10:41 నుండి మ. 12:12 వరకు యమగండం మ. 3:15 నుండి సా. 4:46 వరకు గుళికాకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:03 నుండి ఉ. 8:36 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:37 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3

### ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలను దీటుగా తిప్పికొట్టడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రతిపక్ష విమర్శలను ఎదుర్కోవడం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు వివరించే బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని సీఎం సూచించారు.



# అంతరిక్ష రంగంలో సహకారమే మార్గం

## పారిస్ అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగం

**ఘర్షణ కంటే సహకారానికే ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపు**

**అంతరిక్ష రంగంలో స్థిరత్వం, సమగ్రత అవసరమని వ్యాఖ్య**

**ఇస్రో విజయాలను ప్రపంచం గుర్తించిందని ప్రధాని ప్రశంస**

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. అంతరిక్ష రంగం అపార అవకాశాలతో నిండి ఉందని, అయితే దాని పట్ల ప్రపంచ దేశాలందరికీ ఉమ్మడి బాధ్యత ఉందని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలు మానవాళి సంక్షేమానికి దోహదపడేలా ఉండాలని, దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.

పారిస్, సెప్టెంబర్ 10 :అంతరిక్ష భవిష్యత్తును నిర్మించే క్రమంలో ప్రపంచం సమిష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఘర్షణ కంటే సహకారం, తాత్కాలిక లాభాల కంటే స్థిరమైన అభివృద్ధి, మినహాయింపుల కంటే సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మోదీ స్పష్టం చేశారు. అంతరిక్ష రంగంలో బాధ్యతాయుత విధానాలు అనుసరించకపోతే భవిష్యత్ తరాలకు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. (మిగతా 2వ పేజీలో)



# విద్యుత్ రంగంలో సౌర విప్లవం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**విద్యుత్ రాయితీల భారం తగ్గించేందుకు కీలక నిర్ణయం**

**పంపుసెట్లు, ఇళ్ల సౌర విద్యుదీకరణకు ప్రాధాన్యం**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 :

రాష్ట్ర ఖజానాపై విద్యుత్ రాయితీల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు నిరంతర హరిత ఇంధనాన్ని అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చారిత్రక చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు. శాసనసభలో విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాలపై మాట్లాడిన ఆయన, వ్యవసాయ పంపుసెట్లకు ఏటా సుమారు రూ. 14 వేల కోట్లు, 53 లక్షల ఇళ్లకు గృహజ్యోతి పథకం కింద సుమారు రూ. 5 వేల కోట్లు కలిపి విద్యుత్ రాయితీల రూపంలో రాష్ట్రంపై (మిగతా 2వ పేజీలో)



2

## మేక్ ఇన్ ఇండియాపై ఎంబ్రాయర్ ఆసక్తి

**కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడితో ఎంబ్రాయర్ ప్రతినిధుల భేటీ**

# పంచాయతీలకు నిధులపై చట్టసవరణ

## పంచాయతీల సొంత ఆదాయం బ్యాంకు ఖాతాల్లోనే

## రూ.619 కోట్ల కేంద్ర నిధులు రావాల్సి ఉందన్న సీతక్క



హైదరాబాద్, సెప్టెంబర్ 10 :

గ్రామ పంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చు కునే ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానా ఖాతాలో కాకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా తెలం గాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణ చేసేందుకు ఉ ద్దేశించిన బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. పంచాయ తీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశ పెట్టిన ఈ బిల్లుపై శాసనసభలో (మిగతా 2వ పేజీలో)



# ఓబీసీ కాలమ్‌పై తీర్మానం చేయాలి

## కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి

దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతి జనగ ణనలో ఇతర వెనుకబడిన తరగతుల కాలమ్‌ను చేర్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తెలంగాణ శాసనస భలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ప్రస్తుత జాతి జనగణనలో ఇతర వెనుకబడిన తరగతులకు ప్రత్యేక కాలమ్ లేకపోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 10 :



# రాజోలు అభివృద్ధికి మరో ముందడుగు

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ రోడ్డు పనులకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భూమిపూజ

**ఎన్నో రోజులుగా సమస్యగా ఉన్న రహదారి అభివృద్ధికి శ్రీకారం**

**పనులు చేపట్టనున్న బ్రహ్మ రిషి అర్బన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎల్ ఎల్ పి**



రాజోలు నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. ఎన్నో రోజులుగా రహదారి సమస్యలు ఎదుర్కొంటున్న అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు గురువారం ఘనంగా శ్రీకారం చుట్టారు. సుమారు 5 నుంచి 6 కిలోమీటర్స్ మేర ఈ మార్గం అభివృద్ధి చెందనుంది.

రాజోలు:శ్రీ దేవ వరప్రసాద్ గారు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి అభివృద్ధి పూర్తయితే అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసిం హస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సులభమైన, సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్ర సాద్‌గారు మాట్లాడుతూ, రాజోలు నియోజక వర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపా రు. రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగై న రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రము ఖ పుణ్యక్షేత్రమైన అంతర్వేది ఆలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి తరువాయి 2 వ పేజీలో..

## నేటి రాశి ఫలాలు

**మేషం:** విద్యార్థులకు అనుకూల ఫలితాలు ఉంటాయి. సన్నిహితుల నుంచి అవసరానికి ధనసహాయం అందుతుంది. ఉద్యోగ, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారములలో విజయం సాధిస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.

**వృషభం:** ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకం ఉంటుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వ్యాపారాలు విస్తరిస్తారు.

**మిధునం:** ముఖ్యమైన వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కాదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. శుభకార్యాలకు ధన వ్యయం చేస్తారు. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి.

**కర్కాటకం:** చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం ఉండదు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపారమునకు సకాలంలో పెట్టుబడులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. కుటుంబ బాధ్యతలు మరింత పెరుగుతాయి.

**సింహం:** సంఘంలో విశేష గౌరవ మర్యాదలు పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. విలువైన వస్తు వాహన లాభాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో సొంత నిర్ణయాలతో ముందుకు సాగుతారు. రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది. వ్యాపార వ్యవహారాలలో అనుకూలత పెరుగుతుంది.

**కన్య:** వ్యాపార, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు లాభిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ సేవలకు తగిన గుర్తింపు అందుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

**తుల:** ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు వలన మానసిక సమస్యలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మందగిస్తాయి. ఇంటాబయట చికాకులు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

**వృశ్చికం:** ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఇంటాబయట బాధ్యతలు మరింతగా పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

**ధనస్సు:** భూ వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగ, వ్యాపారాలలో ఆశించిన పురోగతి కలుగుతుంది. విద్యార్థులకు శుభవార్తలు అందుతాయి. సంఘంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. సోదరులతో వివాదాలు రాజీ చేసుకుంటారు.

**మకరం:** ఆరోగ్యం మందగిస్తుంది. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు ఉంటాయి.

**కుంభం:** నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార విస్తరణకు తీసుకున్న నిర్ణయాలు కలసి వస్తాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభవార్తలు అందుతాయి.

**మీనం:** కొన్ని పనులలో శ్రమ తప్పదు. దూర ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలలో నష్ట సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. దాయదులతో ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి.



## రాజోలు అభివృద్ధికి మరో ముందడుగు

మొదటి పేజీ తరువాయి

పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ బ్రహ్మ రిషి అర్బన్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ఎల్ ఎల్ పి (Brahma Rishi Urban Infra Projects LLP) చేపట్టనుంది. భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ డైరెక్టర్ శ్రీ గోల్లా శేఖర్ గారు మాట్లాడుతూ, "రాజోలు ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం మా సంస్థకు ఎంతో సంతోషంగా ఉంది. అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే ఈ ముఖ్యమైన రహదారి అభివృద్ధి పనులను చేపట్టే అవకాశం కల్పించిన రాజోలు ఎమ్మెల్యే శ్రీ దేవ వరప్రసాద్ గారికి, సంబంధిత అధికారులకు మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. బ్రహ్మ రిషి అర్బన్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ఎల్ ఎల్ పి, నిర్మాణ రంగంలో నాణ్యత, సమయపాలన, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్వహిస్తోంది. ప్రజలకు ఉపయోగపడే ఈ రహదారి పనులను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడానికి మా సంస్థ కట్టుబడి ఉంటుంది. రాజోలు ప్రాంత అభివృద్ధిలో భాగం కావడం మా అదృష్టంగా భావిస్తున్నాము" అని తెలిపారు. ఈ రోడ్డు అభివృద్ధి పూర్తయిన తర్వాత అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడనుంది. స్థానిక ప్రజలు, భక్తులు ఈ అభివృద్ధి పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు. భూమిపూజ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మేక్ ఇన్ ఇండియాపై ఎంబ్రాయర్ ఆసక్తి

### రామ్ మోహన్ నాయుడితో ఎంబ్రాయర్ ప్రతినిధుల భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 :

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడిని బ్రెజిల్‌కు చెందిన ప్రముఖ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్ గ్లోబల్ హెడ్ ఆఫ్ గవర్నమెంట్ రిలేషన్స్ జోస్ సెర్రాడోర్ నెటో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారత్‌లో ఎంబ్రాయర్ చేపట్టనున్న "మేక్ ఇన్ ఇండియా" ప్రణాళికలు, ద్వైపాక్షిక సహకార అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. భారత ఏరోస్పేస్ రంగంలో పెరుగుతున్న అవకాశాలపై ఇరు వర్గాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా ఎదుగుతోందని సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. విమాన తయారీ, విడిభాగాల ఉత్పత్తి, నిర్వహణ సేవలు వంటి రంగాల్లో దేశం ప్రపంచ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంబ్రాయర్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత మార్కెట్‌పై ప్రత్యేక ఆసక్తి చూపడం ప్రాధాన్యత సంతరించుకుంది. "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమం కింద భారత్‌లో తయారీ కార్యకలాపాలను విస్తరించే అవకాశాలను ఎంబ్రాయర్ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 :

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన కార్యక్రమాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలితాలను సభా వేదికగా వివరించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. అయితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని సీఎం విమర్శించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు పోలీసులను, ప్రజాప్రతినిధులను దూషించడంతో పాటు మహిళా అధికారుల సమక్షంలో అనుచితంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. టీ-షర్టులు తొలగించి అసభ్యకరంగా ప్రవర్తించారని, సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తూ సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభకు ఉన్న గౌరవాన్ని ప్రతి సభ్యుడు కాపాడాల్సిన బాధ్యత ఉందని, సభా కార్యకలాపాలు సజావుగా జరిగేలా సహకరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాస్తవ పరిస్థితులను వివరించిన నాయకులు, కార్యకర్తలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు. ప్రతిపక్షాల నుంచి వచ్చే విమర్శలకు సమర్థవంతంగా సమాధానం ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. రాజకీయంగా ప్రతిపక్షాలను ఎదుర్కోవడంలో పార్టీ ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడంలో చురుగ్గా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు, నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో వివరించాలని సూచించారు.

## అంతరిక్ష రంగంలో సహకారమే మార్గం

(మొదటి పేజీ తరువాయి)

అందుకే అన్ని దేశాలు కలిసి పనిచేసే వాతావరణం అవసరమని పేర్కొన్నారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, పరస్పర చర్చలు, బహుళపాక్షిక సహకారం ఆధారంగా అంతరిక్ష రంగం అభివృద్ధి చెందాలని అభిప్రాయపడ్డారు. భారత్ సురక్షితమైన, శాంతియుతమైన, స్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు కట్టుబడి ఉందని ప్రధాని తెలిపారు. అంతరిక్షాన్ని పోటీ వేదికగా కాకుండా మానవాళి పురోగతికి ఉపయోగపడే వనరుగా చూడాలని సూచించారు. ప్రపంచ దేశాల మధ్య పరస్పర విశ్వాసం పెంపొందించేందుకు అంతరిక్ష సహకారం కీలకమని చెప్పారు. అంతరిక్ష రంగంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సేవలను ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ ప్రమాణాలతో పాటు తక్కువ వ్యయంతో విజయవంతమైన అంతరిక్ష మిషన్లను నిర్వహిస్తూ ఇస్రో విశేష గుర్తింపు పొందిందని చెప్పారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇస్రో కీలక పాత్ర పోషిస్తోందని, దాని విజయాలు ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకుంటున్నాయని పేర్కొన్నారు. అంతరిక్ష సాంకేతికతను ప్రజల సంక్షేమానికి ఉపయోగించే విషయంలో భారత్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పారిస్‌లో జరిగిన ఈ సదస్సు ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్షాన్ని కలిసి అన్వేషిద్దాం, కలిసి ఆవిష్కరణలు చేద్దాం, కలిసి రక్షిద్దాం అనే భావనతో దేశాలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో భాగస్వామ్యాల ద్వారా కొత్త అవకాశాలను సృష్టించి మానవాళి అభ్యున్నతికి తోడ్పడాలని అన్నారు. భవిష్యత్ తరాలకు మరింత సురక్షితమైన, సుస్థిరమైన అంతరిక్ష వాతావరణాన్ని అందించడం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రతినిధులు పాల్గొని అంతరిక్ష రంగ భవిష్యత్తుపై చర్చలు జరిపారు.

# విద్యుత్ రంగంలో సౌర విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు రూ.18 వేల కోట్ల వార్షిక భారం పడుతోందని వివరించారు. ఈ భారాన్ని తగ్గించడంతో పాటు భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు సౌర విద్యుత్‌ను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పంపుసెట్లతో పాటు ఇళ్లను కూడా సౌర విద్యుత్ ఆధారితంగా మార్చే దిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని భట్టి విక్రమార్క తెలిపారు. సూర్యరశ్మిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగించడం ద్వారా సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై పడుతున్న రాయితీల భారాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు రైతులు, గృహ వినియోగదారులకు స్థిరమైన విద్యుత్ అందించే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. సౌర విద్యుత్ విస్తరణతో పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్‌తో పాటు మరో 81 గ్రామాల్లో సౌర విద్యుత్ ఆధారిత ప్రయోగాత్మక ప్రాజెక్టును ప్రభుత్వం ప్రారంభించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. మొత్తం 82 గ్రామాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు అమలు తీరును, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని, ప్రజలకు కలిగే ప్రయోజనాలను పరిశీలించిన అనంతరం విజయవంతమైన నమూనాను మరింత విస్తృత స్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే మండల స్థాయికి విస్తరించి, సూక్ష్మ విద్యుత్ జాలాల ద్వారా గ్రామాలే తమకు అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని వినియోగించుకునే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లోనే విద్యుత్ ఉత్పత్తి, వినియోగం జరిగే విధానం అమలులోకి వస్తే విద్యుత్ సరఫరాపై ఒత్తిడి తగ్గడంతో పాటు స్థానికంగా విద్యుత్ అవసరాలను తీర్చుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ విధానం తెలంగాణ విద్యుత్ రంగంలో కీలక మార్పునకు నాంది పలుకుతుందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లోనూ సౌర విద్యుత్ వినియోగాన్ని వేగంగా పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందిరా సౌర గిరిజన వికాసం కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో సౌర శక్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. విద్యుత్ మౌలిక వసతులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో సౌర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలను తీర్చడం, ప్రభుత్వ ఆర్థిక భారాన్ని తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం అనే మూడు లక్ష్యాలను సమన్వయంతో సాధించేందుకు సౌర విద్యుత్ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం, గృహ రంగం, గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుతూ తెలంగాణను హరిత ఇంధన రంగంలో ముందంజలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

## ఓబీసీ కాలమ్‌పై అసెంబ్లీ తీర్మానం చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 : తెలంగాణలో నిర్వహించిన కులగణన తరహాలో దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల కులాల వివరాలను ప్రత్యేకంగా సేకరించి, ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ఈ అంశంపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ మేరకు జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వడ్డెర సమాఖ్య అధ్యక్షురాలు గుంజ రేణుక, బీసీ కుల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు కుందారం గణేష్ చారి, సంచార జాతుల సంఘం రాష్ట్ర నాయకులు కాటేపల్లి వీరస్వామి, తిప్పిరిశెట్టి శ్రీనివాస్‌లతో కలిసి ఆయన ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల కులాల లెక్కలు సేకరిస్తామని కేంద్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని అమలు చేయకుండా అన్యాయం చేసిందని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరించడం ద్వారా ఆయా వర్గాల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన వాస్తవ గణాంకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇతర వెనుకబడిన తరగతుల్లోని 51 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 10ను విడుదల చేయడం పట్ల జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంచార జాతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి అవసరమని ఆయన పేర్కొన్నారు. తరతరాలుగా స్థిర నివాసం, విద్య, ఉపాధి, సామాజిక భద్రత వంటి అనేక అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంచార జాతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్తింపు, సంక్షేమం, అభివృద్ధి విషయంలో సంచార జాతులకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 30 లక్షల మంది సంచార జాతుల ప్రజల కోసం సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రిని కోరారు. సంచార జాతుల చరిత్ర, వారి సామాజిక ప్రస్థానం, హక్కులు, అభివృద్ధి అవసరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ దినోత్సవం ఉపయోగపడుతుందని తెలిపారు. సంచార జాతులకు సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## పంచాయతీలకు నిధులపై చట్టసవరణ

(మొదటి పేజీ తరువాయి)

చర్చ అనంతరం ఆమోద ముద్ర వేశారు. చట్టంలోని 70వ సెక్షన్‌లోని మూడో ఉపవిభాగాన్ని సవరించడం ద్వారా గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఈ నిర్ణయం గ్రామస్థాయిలో నిధుల నిర్వహణను మరింత సులభతరం చేయడంతో పాటు స్థానిక అవసరాలకు నిధులను వేగంగా వినియోగించుకునేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ఖజానా ఖాతాలో జమ చేయాల్సి వస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. అనంతరం గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ఖజానా ద్వారా నిర్దిష్ట ప్రక్రియను అనుసరించి తిరిగి తీసుకోవాల్సి వస్తోందని వివరించారు. అనుమతులు, అవసరమైన పత్రాల సమర్పణ వంటి ప్రక్రియల కారణంగా కొన్నిసార్లు నిధుల వినియోగంలో జాప్యం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న విధంగానే గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని కూడా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్టాన్ని సవరిస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీల కోసం ప్రభుత్వం ప్రతి నెలా నిధులు విడుదల చేస్తోందని సీతక్క తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధుల్లో సుమారు రూ.619 కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని, ఎన్నికలు పూర్తయిన తర్వాత పెండింగ్ నిధులు క్రమంగా విడుదల అవుతున్నాయని వివరించారు. స్థానిక సంస్థలకు సంబంధించి 2018లో స్టాంపు డ్యూటీ తొలగించడంతో ఆదాయ వనరులు తగ్గి కొంత ఆర్థిక సంక్షోభ పరిస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రభుత్వం కొనసాగిస్తోందని సీతక్క వెల్లడించారు. ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ శాఖ నుంచి చెల్లించాల్సిన పెండింగ్ నిధులు ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీలు, శాసనసభ్యుల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను పంచాయతీరాజ్ శాఖను కోరుతున్న పరిస్థితి ఉందని వివరించారు. వివాదాల కారణంగా ఎన్నికలు జరగని గ్రామ పంచాయతీలకు కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు అందిస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తోందని సభకు తెలిపారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం కారణంగా రాష్ట్రంపై సుమారు రూ.2 వేల కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను హామ్ విధానంలో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాన్ని కూడా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామని వెల్లడించారు. ఇదే సమయంలో గ్రామ పంచాయతీల నిధులను సహకార బ్యాంకుల్లో జమ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి, నిధుల విడుదల, స్థానిక అభివృద్ధి పనులు, బ్యాంకు ఖాతాల నిర్వహణ వంటి అంశాలపై సూచనలు చేశారు.

శ్వేత

# సంపాదకీయం

**శుక్రవారం 11-9-2026**

## హామీలు కాదు... అమలు మాటేమిటి?

సంక్షేమం ఓట్లు తెచ్చిపెట్టొచ్చు, ఆకాంక్షలను నెరవేర్చకపోతే అధికారాన్ని నిలబెట్టలేదు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం రాజకీయ పార్టీలకు సహజమే. కానీ ప్రజాస్వామ్యంలో హామీ అనేది కేవలం ఎన్నికల ప్రకటన కాదు, ప్రజలతో చేసుకునే ఒక ఒప్పందం. ఆ మాటను ఎంతవరకు నిలబెట్టుకున్నారన్నదే చివరకు ప్రభుత్వ పనితీరుకు కొలమానం. తెలంగాణలో 2023లో జరిగిన అధికార మార్పు ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది. 2014లో కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రజల్లో అపారమైన ఆకాంక్షలు ఉన్నాయి. కొత్త రాష్ట్రం తమ జీవితాలను మార్చుతుందన్న ఆశ కనిపించింది. ఆ సమయంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వ్యవసాయం, విద్యుత్తు, తాగునీరు, సంక్షేమం, మౌలిక వసతులపై దృష్టి పెట్టింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, రైతుబంధు, ఆసరా పింఛన్లు వంటి పథకాలు ప్రత్యక్షంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చాయి. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాలు కూడా ప్రభుత్వ పనితీరుకు కనిపించే గుర్తులుగా నిలిచాయి. ఈ పనితీరే 2018లో మరోసారి ప్రజల మద్దతును అందించడంలో కీలకమైంది.

అయితే రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అంచనాలు మారాయి. కేవలం సంక్షేమం సరిపోదని, తమ పిల్లలకు మంచి విద్య, యువతకు ఉద్యోగాలు, పేదలకు ఇళ్లు, భూమిలేని కుటుంబాలకు భూమి, మెరుగైన జీవన ప్రమాణాలు కావాలని కోరుకున్నారు. అంటే ప్రజల అవసరాలు బతుకుదెరువు నుంచి భవిష్యత్తు వైపు మళ్లాయి. ఇక్కడే హామీల అమలు ప్రభుత్వానికి సవాలుగా మారింది. దళితులకు మూడు ఎకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు ప్రజల్లో భారీ అంచనాలను కలిగించాయి. అయితే వాటిలో కొన్ని పరిమిత స్థాయిలోనే అమలయ్యాయి, మరికొన్ని ఆలస్యమయ్యాయి, కొన్ని పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. ప్రత్యేకంగా యువతలో ఏర్పడిన అసంతృప్తి రాజకీయంగా కీలకమైంది ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన వారికి నియామకాల ప్రక్రియలో జాప్యం, పరీక్షల వివాదాలు, నిరుద్యోగ భృతి అమలు కాకపోవడం వంటి అంశాలు నిరాశ కలిగించాయి. తల్లిదండ్రులకు సంక్షేమం కొంత ఉపశమనం ఇచ్చినా యువత మాత్రం ఉపాధి, అవకాశాలు, భవిష్యత్తు కోరుకుంది. సంక్షేమం తక్షణ సంతృప్తిని ఇవ్వగలదు, కానీ ఆకాంక్షలకు పరిష్కారం చూపకపోతే దీర్ఘకాలిక విశ్వాసం నిలవదు.

అమలు కాని పాత హామీకి బదులు కొత్త హామీ ఇవ్వడం కూడా సమస్యకు పరిష్కారం కాదు. ప్రజలు ఇప్పుడు పథకాల పేర్లను మాత్రమే చూడటం లేదు, ప్రకటన తర్వాత తమ జీవితాల్లో వచ్చిన మార్పును గమనిస్తున్నారు. ఇల్లు వచ్చిందా? ఉద్యోగం వచ్చిందా? పంటకు గిట్టుబాటు లభించిందా? పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోందా? వైద్యం అందుబాటులో ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం కోరుతున్నారు. 2023లో జరిగిన అధికార మార్పును ఒక్క కారణంతో వివరించడం సరైంది కాదు. పదేళ్ల పాలనపై సహజంగా ఏర్పడిన వ్యతిరేకత, అమలు కాని, లేదా ఆలస్యమైన హామీలు, యువత అసంతృప్తి, ప్రత్యామ్నాయానికి ప్రజలు ఇచ్చిన అవకాశం ఇవన్నీ కలిసి ఆ ఫలితాన్ని ప్రభావితం చేశాయి. ఈ పాఠం తెలంగాణకే పరిమితం కాదు, దేశంలోని ప్రతి రాజకీయ పార్టీకి వర్తిస్తుంది. ఎన్నికల హామీ ఎంత గొప్పదన్నది కాదు, దాని అమలు ఎంత నిజాయితీగా జరిగిందన్నదే ప్రజల తీర్పును నిర్ణయిస్తుంది. అందుకే భవిష్యత్తులో రాజకీయ పార్టీలు హామీల సంఖ్యను తగ్గించి, అమలు సామర్థ్యాన్ని పెంచాలి. ప్రతి హామీకి నిధులు, కాలపరిమితి, బాధ్యత వహించే వ్యవస్థను ముందుగానే ప్రకటించాలి. సంక్షేమంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, పెట్టుబడులు, మౌలిక వసతులు, పారదర్శక పాలనకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజలు ఇక ప్రకటనలను లెక్కించరు...ఫలితాలను లెక్కిస్తారు. హామీ ఓటును తెచ్చిపెట్టవచ్చు, కానీ అమలే నమ్మకాన్ని నిలబెడుతుంది.




## చాకలి ఐలమ్మకు ఘన నివాళులు...

కాప్రా, సెప్టెంబర్ 10 (స్టార్ న్యూస్): వీరనారి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సిపిఐఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమల నగర్ ఆఫీస్ నుంచి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య గారు సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి. సత్యం గారు మరియు కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, ఎర్ర అశోక్ ఎం.వినోద జి. శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్. వీరయ్య గారు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం, పోరాటం చేసిన వీర వనితని ఐలమ్మను కొనియాడారు. తన భూమిలో విసునురి రామచంద్రారెడ్డి మనుషులు పంటను కోసుకుపోతూ ఉంటే వారికి ఎదురొడ్డి పోరాడిన వీర వనితని తర్వాత కాలంలో ఆంధ్ర మహాసభ సహకారంతో విసునూరి రామచంద్ర రెడ్డి మనుషులను తరిమి కొట్టి తన పంటను కాపాడుకుందని తెలిపారు. తర్వాత కాలంలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట సమయంలోనే దొడ్డి కొమరయ్య తొలి అమరుడయ్యాడని తెలిపారు. తర్వాత కాలంలో మహిళల హక్కుల కోసం మహిళ పట్ల చూపుతున్న వివక్ష కోసం ఐలమ్మ పోరాటం చేసిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి సత్యం కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి ఎర్ర అశోక్ ఎం వినోద పార్టీ సీనియర్ నాయకులు జి. యాదగిరి రావు, శ్రీమన్నారాయణ, పి గణేష్, సిహెచ్ ప్రసాదు , బి వి సత్యనారాయణ, శివనారాయణ,వెంకటాచారి, జెన్నీ,లీలా వతి ఎంఎస్ రావు, టీ.బీ.చారి శివరామకృష్ణ బాబురావు, శశాంక్ పాల్గొన్నారు.



## ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, సెప్టెంబర్ 10 (స్టార్ న్యూస్): తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన ధీరవనిత, వీరనారి చాకలి ఐలమ్మ గారి వర్ధంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు జుజ×ూలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి, అణగారిన వర్గాల హక్కుల కోసం సాగిన పోరాటానికి చాకలి ఐలమ్మ గారు చిరస్మరణీయ ప్రతీక అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ గారి త్యాగాలను స్మరించుకుంటూ ఆమెకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దీ=ూ పార్టీ నాయకులు కార్యకర్తలు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



## పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన...

మల్కాజిగిరి, సెప్టెంబర్ 10 (స్టార్ న్యూస్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా కుషాయిగూడలో ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ రావ్ గారి ఆదేశానుసారం కార్యదర్శి/సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్ ప్రియాంక పారా లీగల్ వాలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయ సేవాధికర సంస్థ చట్టం ముఖ్య ఉద్దేశం, లక్ష్యాల గురించి పారా లీగల్ వాలంటీర్లకు వివరించారు. ఈ సమావేశం లో పారా లీగల్ వాలంటీర్ల హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. ఈ సేవాధికార సంస్థ యొక్క నెలవారీ కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో 15 మంది పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు

### మాజీ మంత్రి కేటీఆర్ గారికి మట్టి వినాయకుడి విగ్రహం అందజేత

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (స్టార్ న్యూస్) : ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల మహేందర్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మట్టి వినాయకుడి విగ్రహాన్ని అందజేసారు. ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి గత కొంతకాలంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణహిత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా ప్రజలను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. “మట్టి వినాయకుడు -- పర్యావరణానికి రక్షణ, భక్తికి ప్రతీక” అనే సందేశంతో ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షులు భాషపల్లి నిరంజన్ చారి మడ్డి యుగేందర్ రెడ్డి అలెగ్జాండర్ సంపత్ గౌడ్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..




## కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పీహెచ్డీ సాధించిన దీపా బానోత్

తార్నాక, సెప్టెంబర్ 10 (స్టార్ న్యూస్) : కాప్రా లో నివసించే ఓ మహిళ కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే డాక్టరేట్ సాధించింది. ఉస్మానియా యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధక విద్యార్థిని డా.దీపా బానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయం. డా.దీపా బానోత్ “తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ మరియు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం (తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన పబ్లిక్ మరియు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలలో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం)” అనే అంశంపై పరిశోధన జరిగింది. ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తికి తగిన సూచనలను కూడా ప్రతిపాదించారు. ఈ పరిశోధనను డా.వి.సమున్నత గారి పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు సిబ్బంది డా. దీపా బానోత్‌ను అభినందించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలను (పెద్ద కుమారుడు వీదీదీూ మరియు చిన్న కుమారుడు ఇంజనీరింగ్) చదువుతున్న సమయంలోనూ కుటుంబ భాధ్యతలు చూసుకుంటూ పీహెచ్‌డీ సాధించడం ద్వారా దీపా బానోత్ తన సంకల్పం, పట్టుదల, కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్నా ఉన్నత లక్ష్యాలను సాధించినట్లు నిరూపించారు. ఈ సందర్భంగా డా. దీపా బానోత్ తన విజయానికి సహకరించిన తన భర్త శ్రీ రవి తేజకు, కుటుంబ సభ్యులకు మరియు తన పరిశోధన పర్యవేక్షకురాలు డా.వి. సమున్నతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశోధన సమయంలో వారు అందించిన నిరంతర ప్రోత్సాహం, సహకారం తన పీహెచ్డీ ప్రయాణంలో కీలకమని ఆమె పేర్కొన్నారు. ఆమె సాధించిన ఈ విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలని ఆకాంక్షించే మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.



# ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ప్రధాన రహదారులను అభివృద్ధి

నగరంలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఎన్‌క్యాప్ నిధులు రూ.6.57 కోట్లతో నగరంలోని 9 ప్రధాన రహదారుల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన రహదారి పనులను 15 నుంచి 20 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. త్వరలోనే మరో రూ.4.72 కోట్లతో ఐదు నూతన రహదారుల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలో శిలాఫలకాలు వేసిన ప్రతి రహదారి పనిని పూర్తి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రాధాన్యతా క్రమంలో అధిక జనాభా కలిగిన, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. వ్యాపారస్తులు, వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఏ విధంగా అందిస్తుందో ప్రజలు గమనించాలని బడేటి చంటి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 53 రోజులు జైలులో ఉన్నప్పటికీ ఎన్నో కష్టాలను అధిగమించి తిరిగి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఏలూరు నగరంలోని 62 డివిజన్లలో కూటమి అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు బహుమతిగా ఇవ్వాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, నగర టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, పూజారి నిరంజన్, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, మారం అను, కాంట్రాక్టర్ గునిశెట్టి రాజేష్, నవయుగ సుబ్బారావు, నాయుడు సోము, రాజా మురళి, కాంట్రాక్టర్ రవిచంద్ర, ఉ మామహేశ్వరరావు,మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## నందిగామలో ఈ నెల 11న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

**నందిగామ నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి**

**జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**

విజయవాడ: సెప్టెంబర్ 10,2026: "ఒక నెల – ఒక నియోజకవర్గశీ – నాలుగు పర్యటనలు"లి కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 11వ తేదీ శు క్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. నందిగామ మధిరరోడ్డులోని ఆర్.ఎస్ గార్డెన్స్ నందు ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. నందిగామ నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ కోరారు.




# రైతు వ్యతిరేక చట్టాలపై రైతు ఉద్యమం

**లికేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలతో రైతు మనుగడ ప్రశ్నార్థకం..**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఆందోళన**

**లిఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం డిమాండ్..**

ఉంగుటూరు (క్రైకరం) సెప్టెంబర్ 10

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలపై రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

గురువారం ఉంగుటూరు మండలం క్రైకరం లోని గుత్తికొండ వారి సత్రం హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు.

ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలపై రైతాంగం చారిత్రాత్మక ఉ ద్యమం చేశారని, ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేసి మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50% కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని, ఈ ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కానీ నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్నాయని, దీనితో రైతు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ల నియంత్రణ చట్టం, సహకార చట్టం, విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టం, ప్రకృతి వైపరీత్యాల సహాయ కార్యక్రమాల చట్టం, ఎరువుల విధానం, పంటల బీమా పథకం, డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ ఇలా అనేక చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చి వేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల ఎకరాలు రాష్ట్రంలో భూ సేకరణ చేసి కార్పొరేట్ కంపెనీలకు రైతుల భూములను కట్టబెట్టాలని చూస్తోందని, బలవంతపు భూసేకరణ వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు.ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న అన్ని పంటల రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, పాడిపశు వులకు సబ్సిడీపై దాణా అందించాలని కోరారు. కోకో,కొబ్బరి, ఆయిల్ పామ్, పొగాకు, విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతాంగ సమస్యలపై దశల వారి ఉద్యమం చేపట్టాలని సమావేశం నిర్ణయించిందని తెలియజేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, లావేటి సోంబాబు, బోడిక రామచంద్ర రావు, దాసరి సతీష్, వీరవల్లి భాస్కరరావు, సున్నా వెంకట్రావు, గుండపనేని సురేష్,కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## మానసిక ఒత్తిడి రహిత జీవనమే సంపూర్ణ ఆరోగ్యం

**జయవంతంగా మానసిక ఆరోగ్య అవగాహన, శిక్షణ కార్యక్రమం**

నేటి సమాజంలో తీవ్రమవుతున్న మానసిక ఒత్తిళ్లను జయించడానికి ప్రణాళికాబద్ధమైన జీవనశైలి, సమయపాలన అత్యంత అవసరమని ప్రముఖ మానసిక నిపుణులు అభిప్రాయపడ్డారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికార యంత్రాంగం మానవ అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో ఆకర్ష ఫౌండేషన్ భాగస్వామ్యంతో జరిగిన స్ట్రెస్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో స్వర్ణ వార్డు కార్యదర్శులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్త నవితాశ్రీ.. దాదాపు 25 నిమిషాల పాటు 'జాకబ్సన్ రిలాక్సేషన్', 'హిప్నోటిక్ రిలాక్సేషన్', యోగా, ధ్యాన విధానాలపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. సమయపాలన పాటిస్తే ఒత్తిడి లేకుండా పనిసామర్థ్యాన్ని మరింత పెంచుకోవచ్చని ఆమె సూచించారు. కార్యక్రమానంతరం మానసిక ఆరోగ్య రంగానికి నవితాశ్రీ అందిస్తున్న సేవలకు గాను డాక్టర్ గర్రే శంకరరావు, డాక్టర్ టి.ఎస్. రావు, జగదీష్, నోడల్ ఆఫీసర్ జి. జ్యోతి ఆమెను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.



అమరావతి సచివాలయంలో గురువారం గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు తొలిరోజు సమావేశంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సమావేశంలో 7వ కలెక్టర్ల సదస్సు నిర్ణయాల అమలుపై చర్యల నివేదికపై సమీక్ష జరిగింది. అదేవిధంగా ప్రజలు మెచ్చే సుపరిపాలన, నాయకత్వంలో కొత్త ఆలోచన.. పాలనలో సరికొత్త వేగం, జిల్లాలు, నియోజకవర్గాల వారీగా ప్రాధాన్య అంశాలు, తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు, పనితీరులో పోటీతత్వం, అవకాశాలు, వనరుల సద్వినియోగం, పెట్టుబడుల గ్రౌండింగ్, డిజిటల్ కనెక్టివిటీ, అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు తదితరాలపై గౌరవ ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా పకడ్బందీ చర్యలు

**అధికారులకు ఆదేశాలు**
**సమన్వయ సమావేశం**
**మండపాల భద్రత**
**నిమజ్జన ఏర్పాట్లు**
**మట్టి విగ్రహాల ప్రతిష్ఠ**
**పోలీసు బందోబస్తు**
**అవగాహన కార్యక్రమం**




**సంగారెడ్డి ప్రతినిధి, 10 సెప్టెంబర్, :**

సంగారెడ్డి, సెప్టెంబర్ 09: జిల్లాలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. వినాయక చతుర్థి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి, బుధవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో కలెక్టర్, ఎస్పీ పరితోష్ పంకజ్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉత్సవాలు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్ల ను ముందుగానే పూర్తి చేయాలన్నారు. గణేష్ మండపాల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు తప్పని సరిగా పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలి. మండ పాల వివరాలను సంబంధిత అధికారులకు ముందు గానే తెలియజేయాలి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలను నివారించేందుకు నాణ్యమైన వైరింగ్, తగిన భద్రతా పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా, ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలి, క్రేన్లు, తగిన లైటింగ్, బారికేడింగ్, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు చేయాలి, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా ప్రజలు, ముఖ్యంగా యువతలో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యా వరణ హితంగా ఉత్సవాలను నిర్వ హించాలని కోరారు. ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతి భద్ర తలకు ఎలాం టి విఘాతం కలగ కుండా, కట్టుది ట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మండపాల నిర్వాహ కులు, నిమజ్జన కార్యక్ర మంలో పోలీసుల సూచన లు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠపై ప్రజలకు అవగాహన కల్పించేం దుకు, కాలుష్య నియంత్రణ మండలి రూపొందిం చిన గోడపత్రికలను కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ ఆవిష్కరించారు, అనంతరం మట్టి వినా యక విగ్ర హాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అద నపు కలె క్టర్ పాండు, కాలుష్య నియంత్రణ మండలి, పంచాయతీ రాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ, నీటి పారుదల, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారు లు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు,

# ఐలమ్మకు బీఆర్ఎస్ ఘన నివాళి

**ఐలమ్మ వర్ధంతి.. సంగారెడ్డిలో నివాళులు**
**పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపు**
**ఐలమ్మ ఆశయాలు ఆదర్శనీయం**




**సంగారెడ్డి ప్రతినిధి, 10 సెప్టెంబర్, :**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించాయి. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు, స్థానిక క్యాంపు కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. భూస్వామ్య, నిరం కుశ పాలనపై ధైర్యంగా పోరాడిన ఐలమ్మ ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో చింత సాయినాథ్, విజేందర్ రెడ్డి, వేణుగోపాల స్వామి, కౌన్సిలర్లు పొన్న రాజేందర్ రెడ్డి, లాడే మల్లేశం, నవీన్, నాయకులు విఠల్, కసిని శ్రీకాంత్, విష్ణువర్ధన్, మోహన్, అజీమ్, శ్రవణ్ రెడ్డి, లాడే బాలు, శరత్, రవి, సంగమేష్, ఆంజనేయులు, గురు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో కలెక్టర్ విస్తృత పర్యటన

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 10, :**

ఉట్నూరు మండలంలోని నర్సాపూర్ (బి) గ్రామంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. లబ్ధిదారులకు త్వరగా గృహాలు అందించేం దుకు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. నిర్మాణ సామగ్రి నాణ్యతతో పాటు భవనాల భద్రత అంశాలపై కూడా దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామంలో తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (రెడ్కో) ఆధ్వర్యంలో జరుగుతున్న సోలార్ ప్లాంటేషన్ సర్వే ప్రక్రియను కూడా కలెక్టర్ పరిశీలించారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుకూలమైన స్థలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరు త్పాదక ఇంధన రంగ అభి వృద్ధికి ఈ ప్రాజెక్టులు దోహద పడ తాయని పేర్కొం టూ, సర్వే ప్రక్రియను సమర్థ వం తంగా పూర్తి చేయాలని సూ చించా రు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆశ్రమ ఉ న్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, వంటగది తది తర సదుపా యాలను పరిశీ లించి విద్యార్థులకు అందుతు న్న సౌ కర్యాలపై వివరాలు అడిగి తెలుసుకు న్నారు.



పరిశుభ్రత, ఆహార నాణ్యత, విద్యార్థుల భద్రత అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉ ండకూడదని సంబంధిత సిబ్బందికి సూచించా రు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేం దుకు చర్యలు కొనసాగించాలని చెప్పారు. పాఠశాల నిర్వహణ, మౌలిక వసతుల స్థితిగతులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్ర మాలు, విద్యా రంగ అభివృద్ధి చర్యలు సమన్వయం తో కొన సాగాలని సూచించారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ కే. ప్రణయ్‌కుమార్, తహసీల్దార్ రఘునాథ్ రావు, మండల స్థాయి అధికారులు, రెడ్కో ప్రతినిధులు శ్రీని వాస్, హౌసింగ్ శాఖ అధికారులు, ఇతర శాఖల సిబ్బం ది పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయు లు, విద్యార్థులు, గ్రామస్థులు కూడా హాజరయ్యారు. గ్రామాభివృద్ధి, గృహ నిర్మాణాలు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, విద్యా సదుపాయాల పురోగతిపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.

# గణేష్ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 10, :**



గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో విస్తృత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు ప్రధాన అంశంగా నిలిచాయి. నిమజ్జన మార్గాలు, భక్తుల రద్దీ నియంత్రణ, ప్రజల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు శాఖల మధ్య సమ న్వయం కీలకమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు, తాగునీరు వంటి పౌర సదుపా యాల కల్పనపై కూడా సమావేశంలో చర్చించారు. ఉత్సవాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా నిమజ్జన ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రతా చర్యలపై దృష్టి సారించాలని సూచిం చారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్, మూడు మున్సిపల్ జోన్ల కమిషనర్లు, పోలీసు శాఖ, హైడ్రా, విద్యుత్, యూబీడీ, మెయింటెనెన్స్ తదితర శాఖల అధికా రు లు హాజరయ్యారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో ప్రతి శాఖ పోషించాల్సిన పాత్రపై చర్చించి, బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి తరఫున కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్. శశిధర్‌తో పాటు కన్వీనర్లు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నా రు. భక్తుల అవసరాలు, నిమజ్జన నిర్వహణకు సంబంధిం చిన సూచనలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమన్వయంతో పనిచేస్తే ఉ త్సవాలను విజయవంతంగా నిర్వహించవచ్చని అభిప్రాయపడ్డారు. గణేష్ ఉత్సవాలు ప్రజలందరికీ సురక్షితంగా, బాధ్యతాయుతంగా జరిగేలా అన్ని శాఖలు కలిసికట్టుగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.




# సంగారెడ్డి నారాయణ కళాశాల అక్రమాలు అధికారుల లంచాలు?

**అనుమతుల్లేని కళాశాల నిర్వహణ,,డిఐఈఓకు లంచాల ఆరోపణలు**
**ప్రజా సంఘాల హెచ్చరిక, తక్షణ చర్యలకు డిమాండ్**

**సంగారెడ్డి ప్రతినిధి, 10 సెప్టెంబర్, :**

సంగారెడ్డి, సెప్టెంబర్ 10: పట్టణంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి నిరంకుశంగా కొనసాగుతున్న నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అక్రమ కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారికి సదరు యాజ మాన్యం భారీ ఎత్తున లంచాలు సమర్పించుకున్నట్లు వస్తున్న ఆరోపణలు విద్యావ ర్గాల్లో విస్మయం కలిగిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను చేర్చుకుని, అమాయక విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెడుతున్న ఈ కళాశాల బాగోతంపై పూర్తి సమాచారం ఉన్నప్పటికీ, సదరు అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేని కళాశాలకు విచారణ పేరిట ముడుపులు ముట్టచెప్పి, ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ వేడుకుంటున్న వైనం కొనసాగుతుండడం అధికారుల అవినీతికి నిదర్శనంగా నిలుస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే ఇలాంటి అక్రమాలకు ఊతమివ్వడం అత్యంత దారుణమని, తల్లిదండ్రులు సైతం అప్రమత్తమై అనుమతులు లేని ఇలాంటి విద్యా సంస్థల్లో పిల్లలను చేర్పించే ముందు పునరాలోచించాలని విద్యార్థి, ప్రజా సంఘాలు హెచ్చరించాయి. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అక్రమ నారాయణ కాలేజ్, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# సంగారెడ్డిలో 3వ జాతీయ లోక్‌అదాలత్

**నిర్వహణ వివరాలు.. పరిష్కారమయ్యే కేసులు**
**సమయం, ధనం ఆదా..ప్రజలకు, అధికారులకు పిలుపు**

**సంగారెడ్డి ప్రతినిధి, 10 సెప్టెంబర్, :**



సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12, 2026న 3వ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి. భవానీ చంద్ర ఈ విషయాన్ని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోర్టుతో పాటు జహీరాబాద్, జోగి పేట, నారాయణఖేడ్, జిన్నారం కోర్టు ప్రాం గణాల్లో ఈ అదాలత్ జరుగుతుంది. వివిధ రకాల సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటా ర్ వాహన ప్రమాద పరిహార కేసులు, కు టుంబ వివాదాలు, బ్యాంకింగ్, ఇతర రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంది. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు ఇరు పక్షాల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుంది, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. సెప్టెంబర్ 12, 2026న నిర్వహించనున్న 3వ జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక సంఖ్యలో కేసులను పరిష్కరించే విధంగా న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె కోరా రు. పెండింగ్ కేసులతో పాటు ప్రీ-లిటిగేషన్ దశలో ఉన్న వివాదాలను కూడా పరస్ప ర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ కేసుల పరిష్కారం కోసం సంబంధిత కోర్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ/తాలూకా న్యాయ సేవా కమిటీని సంప్రదించి లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని జి. భవానీ చంద్ర పిలుపునిచ్చారు. 'రాజీ మార్గమే ఉత్తమ మార్గం – లోక్‌అదాలత్ ద్వారా త్వరితగతిన న్యాయం' అనే లక్ష్యంతో 3వ జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడానికి అన్ని వర్గాలు సహకరించాలని ఆమె కోరారు.



# బాలికలు నైపుణ్యాలతో ఎదగాలి

**నారాయణపేట, సెప్టెంబర్ 10, :**

బాలికలు వివిధ నైపుణ్య శిక్షణలు పొందుతూ ఆర్థికంగా సాధికారత సాధించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో--బేటీ పడావో పథకం ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, బాలికలు విద్యతో పాటు వివిధ వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత రంగాల్లో రాణించడంతో పాటు, సమాజంలో మహిళా సాధికారతకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. కంప్యూటర్ పరిజ్ఞానం బాలికలకు భవిష్యత్తులో ఎన్నో అవకాశాలను అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం విద్య, ఉద్యోగం, వ్యాపారం, స్వయం ఉపాధి తదితర రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారిందని తెలిపారు. చాలామంది తమకు మంచి ఉద్యోగం వస్తే బాగుంటుందని భావిస్తారని, అయితే అవకాశం వచ్చినప్పుడు దానిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ఉద్యోగ అవకాశం కోసం ఎదురుచూడకుండా స్వయంగా ప్రయత్నాలు ప్రారంభించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న కంప్యూటర్ నైపుణ్యాలను నిరంతరం అభ్యసిస్తూ మరింతగా మెరుగుపరుచుకోవాలని, వాటిని ఉపాధి అవకాశాలుగా మార్చుకునే దిశగా ముందుకు సాగాలని అన్నారు. నేటి ప్రపంచంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రియాంక తెలిపారు. ప్రపంచంలోని అనేక విషయాలు మొబైల్ ఫోన్ ద్వారా మన చేతుల్లోకి వచ్చాయని, కంప్యూటర్, మొబైల్ వంటి సాంకేతిక సాధనాలను కేవలం వినోదానికి మాత్రమే పరిమితం చేయకుండా జ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న విద్యా వనరులు, నైపుణ్య శిక్షణలు, ఉద్యోగ సమాచారం, ఉపాధి అవకాశాలను తెలుసుకుని వాటిని అందిపుచ్చుకోవాలని బాలికలకు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బాలికలకు కూడా విస్తృతమైన అవకాశాలను చేరువ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి బాలిక తనలోని ప్రతిభను గుర్తించి, దానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ అన్నారు. శిక్షణ పూర్తయిందనే స్థాయిలో ఆగిపోకుండా, నేర్చుకున్న నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఉద్యోగం పొందడం మాత్రమే కాకుండా స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, ఫ్రీలాన్స్ అవకాశాలు, ఇతర వృత్తి ఆధారిత కార్యకలాపాల ద్వారా కూడా ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. ఆర్థిక స్వావలంబన మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు కుటుంబం, సమాజంలో వారి నిర్ణయాత్మక పాత్రను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. బాలికల విద్య, భద్రత, సాధికారతతో పాటు బాల్య వివాహాల నిర్మూలనకు కూడా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బాలికలకు చిన్న వయసులో వివాహం చేయకుండా ఉన్నత విద్యను కొనసాగించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, వారి భవిష్యత్తుకు అవసరమైన అవకాశాలను కల్పించాలని సూచించారు. బాలికలు విద్య, నైపుణ్యాలు, ఆర్థిక స్వావలంబనతో ఎదిగినప్పుడే మహిళా సాధికారత లక్ష్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉచిత కంప్యూటర్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ ప్రియాంక సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ ద్వారా పొందిన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తమ భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవాలని, ఉద్యోగం లేదా స్వయం ఉపాధి దిశగా తదుపరి అడుగులు వేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు, సంబంధిత అధికారులు, శిక్షణ పొందిన బాలికలు పాల్గొన్నారు. బాలికలకు నైపుణ్య శిక్షణలు అందించడం ద్వారా వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష

**జోగులాంబ గద్వాల, సెప్టెంబర్ 10, :**



జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం కేటీదొడ్డి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, ఎస్ఐఆర్ ప్రక్రియ అమలుపై సమీక్ష నిర్వహించారు. మండలంలో కొనసాగుతున్న పనుల పురోగతిని తహసీల్దార్‌తో చర్చించి పలు సూచనలు చేశారు. మ్యాపింగ్ కాకపోయిన వారు, అనామలీస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. నోటీసులు అందుకున్న వారు నిర్దేశిత తేదీల్లో విచారణలకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగాలని స్పష్టం చేశారు. అవసరమైన అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలను రెండు రోజుల్లోగా మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలను వేగంగా అందించాలని తెలిపారు. ప్రభుత్వ సేవల విషయంలో ఆలస్యం జరగకుండా ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించిన కలెక్టర్, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధులపై ఆరా తీశారు. భూ భారతి, సాదా బైనామా తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యాలయ నిర్వహణ, పరిశుభ్రత అంశాలపై కూడా కలెక్టర్ దృష్టి సారించారు. కార్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులను సక్రమంగా భద్రపరచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు వారికి అనుకూలమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి, టీజీ డబ్ల్యూఐడీసీ ఏఈ మోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన మార్గదర్శకాలు జారీ చేశారు.

# కేంద్రీయ విద్యాలయానికి స్థల సన్నాహాలు

**ది కొత్తగూడెం, సెప్టెంబర్ 10, :**



కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి లక్ష్మీదేవిపల్లిలో ఉన్న విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లికి తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మీదేవిపల్లిలోని పాల శీతలీకరణ కేంద్రా న్ని ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలిం చారు. కేంద్రం మార్పు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటన సందర్భంగా పాల సేకరణ, శీతలీకరణ ప్రక్రి య, మౌలిక సదుపాయాలు, పరికరాల పనితీరుపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ద్వారా సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు అనుసంధానమై ఉన్నారని అధి కారులు వివరించారు. రైతుల నుంచి సేకరించే పాల పరిమాణం, సేవల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల పాలు సేకరిస్తుండగా, పాల ఉత్పత్తి అధికంగా ఉండే సీజన్‌లో ఈ పరిమాణం 4 వేల లీటర్ల వరకు పెరుగుతుందని అధికారులు తెలిపారు. సేకరించిన పాలను ఖమ్మం డెయిరీకి తరలిస్తున్నట్లు వివరించారు. పాల సేకరణలో అంతరాయం కలగకుండా కేంద్రం మార్పు ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కూలింగ్ ట్యాంక్, స్టోరేజ్ వ్యవస్థ, కంప్రెసర్ తదితర పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. చుంచుపల్లిలో విజయ డెయిరీ కోసం ఇప్పటికే స్థలం కేటాయించిన నేపథ్యంలో అక్కడ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు కు అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నిర్మాణ పనులు, పరికరాల తరలింపు తది తర అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. కేంద్రం తరలింపు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్ట ర్ స్పష్టం చేశారు. పాలసేకరణ, నిల్వ, రవాణా వ్యవస్థలు నిరంత రాయంగా కొనసాగాలని చెప్పారు. కొత్త కేంద్రం ద్వారా రైతుల కు మరింత మెరుగైన సేవలు అందేలా ప్రణాళిక రూపొందిం చాలని అధికారులకు సూచిం చారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభించనున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అదే సమయంలో చుంచుపల్లిలో పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటుతో రైతులకు కూడా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, విజయ డెయిరీ మేనేజర్ సౌజన్య, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో పోషణ మాసం ప్రారంభం

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 10, :**





మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 9వ 'పోషణ మాసం' (పోషణ్ అభియాన్) ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై పోషణ మాసం నిర్వహణ, లక్ష్యాలు, కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పోషకాహార లోపాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా 9వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, యుక్తవయస్క బాలికల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహారంపై మరింత విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. పోషణ మాసం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేప ట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులు వివరించారు. పోషకా హార లోపాల గుర్తింపు, ఆరోగ్య పరీక్షలు, అవగాహన సదస్సులు, తల్లులకు పోషకాహార సూచనలు వంటి అంశాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ప్రజలకు చేరువ కావాలని కలెక్ట ర్ సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల ఆహారం ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. పోషకాహార లోపాల నివారణలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుం బానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జడ్పీ సీఈవో రవి, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజుతో పాటు పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పోషణ మాసం విజయవంతం కోసం శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంచి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పోషణ మాసం కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిం చనున్నట్లు అధికారులు తెలిపారు.

# గురుకుల పాఠశాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ములుగు, సెప్టెంబర్ 10, :**

ములుగు మండలం బండారుపల్లిలోని తెలంగాణ గురుకుల పాఠశాల (బాలుర) జూని యర్ కళాశా లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యా సేవలు, వసతి సదుపాయాలు, పాఠశాల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యా బోధన విధానం, తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ప్రతిభా భివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న వసతి సదుపాయాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. హాస్టల్ గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య పరిస్థితులు, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అవసరమైన మెరుగుదల చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు పరిశుభ్రమైన, సురక్షిత మైన వాతావరణంలో ఉండేలా చూడాలని అధికారులకు తెలిపారు. హాస్టల్ నిర్వహణ, ఆహార నాణ్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని, ఆరోగ్య పరిరక్షణ చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయాలని తెలిపారు. సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను ఆదర్శవం తమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.



# ఎక్సైజ్ షాపు కేటాయింపు లాటరీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 10, :**

సికింద్రాబాద్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలో ఎక్సైజ్ షాపు కేటాయింపునకు సంబంధించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల లాటరీ డ్రా నిర్వహించారు. దరఖాస్తుదారుల సమక్షంలో ఈ లాటరీ ప్రక్రియను చేపట్టారు. ఎక్సైజ్ షాపు కేటాయింపులో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా, నిబంధనలకు అనుగుణంగా పారద ర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను నిర్వహిం చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. లాటరీ డ్రా ప్రక్రియను దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించడం ద్వారా కేటాయింపు వ్యవహా రంలో స్పష్టత, విశ్వసనీయత ఉండేలా అధికారు లు చర్యలు చేపట్టారు. జిల్లా నిషేధ మరియు ఎక్సైజ్ కార్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎక్సైజ్ షాపు కేటాయింపునకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. నిర్ణీత గడువులో మొత్తం ముగ్గురు దరఖాస్తుదారుల నుంచి ఆరు దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం నిబంధ నల ప్రకారం లాటరీ ద్వారా షాపు కేటాయింపు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియలో దరఖాస్తుల సంఖ్య, అర్హతలు, కేటాయింపు విధానానికి సంబంధించిన అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. ఎక్సైజ్ షాపు కేటాయింపు ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల స్వయంగా లాటరీ డ్రా నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దరఖాస్తుదారుల సమక్షం లో లాటరీ నిర్వహించడం ద్వారా కేటాయింపు ప్రక్రియ అందరికీ స్పష్టంగా కనిపించేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేటాయింపు ప్రక్రియ కొనసాగాలని, అందరికీ సమాన అవకాశాలు ఉండేలా వ్యవహరించాలని అధికారులు చర్యలు తీసుకున్నారు. లాటరీ విధానం ద్వారా కేటాయింపు చేపట్టడంతో ప్రక్రియపై దరఖాస్తుదారులకు స్పష్టత కలిగేలా చూశారు. మూడు మంది దరఖాస్తుదారుల నుంచి ఆరు దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ షాపు కేటాయింపునకు పోటీ నెలకొంది. నిర్ణీత గడువు ముగిసిన అనంతరం అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, లాటరీ డ్రాకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. దరఖాస్తుదారులు ప్రత్యక్షంగా హాజరైన సమయంలోనే లాటరీ నిర్వహించడంతో కేటాయింపు ప్రక్రియపై ఎలాంటి సందేహాలు లేకుండా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, ఎక్సైజ్ శాఖ నిబంధనలకు అనుగుణంగా మొత్తం ప్రక్రియను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

ఎక్సైజ్ షాపుల కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, దరఖాస్తుదారులకు ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించడం ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి లాటరీ డ్రా వరకు ప్రతి దశను నిర్ణీత విధానంలో నిర్వహించారు. జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో చేపట్టిన ఈ లాటరీ డ్రా ద్వారా షాపు కేటాయింపు ప్రక్రియను పూర్తి చేశారు. పారదర్శకత, నిష్పక్షపాతత్వం, నిబంధనల అమలుకు ప్రాధాన్యత ఇస్తూ ఎక్సైజ్ శాఖకు సంబంధించిన కేటాయింపు ప్రక్రియలను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

# రాష్ట్రపతికి అనిల్ కూర్మాచలం లేఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్య విలువలు, ప్రతిపక్ష హక్కులు దెబ్బతింటున్నాయని ఎఫ్డీసీ మాజీ చైర్మన్, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై తక్షణ జోక్యం చేసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తన లేఖలో తెలంగాణలో ప్రతిపక్షాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉండాల్సిన సమతుల్యత దెబ్బతింటోందని అనిల్ కూర్మాచలం పేర్కొన్నట్లు సమాచారం. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతిపక్షాల పాత్ర కీలకమని, వారి హక్కులను పరిరక్షించడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలను రాష్ట్రపతి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రతకు సంబంధించిన అంశాలను కూడా లేఖలో ప్రస్తావించినట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఉన్న కేసీఆర్‌కు తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నా రు. ఈ విషయంలో సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని రాష్ట్రపతిని కోరినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఆరోగ్యకరంగా కొనసాగాలంటే ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఉందని అనిల్ కూర్మాచలం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు మారినా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి ఎల్లప్పుడూ పరిరక్షించబడాలని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కూడా రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలకు అతీతంగా రాజ్యాంగ విలువలను కాపాడాలని సూచిం చారు. రాష్ట్రపతికి పంపిన ఈ లేఖపై కేంద్ర స్థాయిలో ఎలాంటి స్పందన వస్తుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రాజకీయాల్లో జరుగు తున్న పరిణామాల నేపథ్యంలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాస్వామ్య హక్కులు, రాజకీయ నాయకుల భద్రతకు సంబంధించిన అంశాలపై చర్చ మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.




# సీఎం రేవంత్‌కు గణేష్ ఉత్సవ ఆహ్వానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 10, :**

శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా సికింద్రాబాద్ శ్రీ గణేష్ దేవాలయ కమిటీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆహ్వానించింది. గురువారం అసెంబ్లీ లోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్, దేవాలయ కమిటీ అర్చకులు కలిసి ముఖ్య మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. గణప తి నవ రాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించి కార్యక్ర మానికి హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్య మంత్రికి ఆశీర్వచనాలు అందించి, ఉత్సవాలు విజయవం తంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారా నికి కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్‌లో నిర్వహించే గణేష్ ఉత్సవాలు రాష్ట్రంలోనే అత్యంత ప్రాము ఖ్యత కలిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఒకటిగా నిలు స్తాయని పేర్కొన్నారు. వేలాది మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొం టారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాల య కమిటీ ప్రతినిధులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుం డా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఆహ్వాన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు శాసనసభ్యులు కూడా హాజరై గణేష్ ఉత్సవాల ప్రాము ఖ్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించా రు. ప్రతి ఏడాది నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తు లు సికింద్రాబాద్ గణేష్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు కొనసాగు తున్నాయి. దేవాదాయ శాఖ, దేవాలయ కమిటీ, స్థానిక పరిపాలనా యంత్రాంగం సమన్వయంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టాయి. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికా రులు తెలిపారు. ఈ ఏడాది గణపతి నవరాత్రి ఉత్సవాలు మరింత వైభవంగా జరగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నా రు.

# కరెంటు కోతలపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైం దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో రైతులకు అందిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానం లో రాష్ట్రంలో మళ్లీ విద్యు త్ కోతలు, సరఫరా సమస్యలు మొదల య్యాయని ఆరోపించారు.



ఈ మేరకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండా౼ెడ్డిపల్లికి చెందిన రైతులు తమ సమస్యలను వివరిస్తున్న వీడియోను కేటీఆర్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పంచుకున్నారు. వీడియోను ప్రస్తావిస్తూ కాంగ్రె స్ ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అంటూ కేటీఆర్ తన పోస్టులో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో విద్యుత్ సరఫరాలో సాధించిన పురోగతిని ప్రస్తావి స్తూ, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి పాలమూరు ప్రాంతంలోనే విద్యుత్ సరఫరా పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంద నే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. రైతులకు నిరంతరా యంగా విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు విద్యుత్ కోతలు, తక్కువ వోల్టేజ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ ఆరోపిం చారు. సరిపడా వోల్టేజ్ లేకపోవడం, అవసరమైన సమ యంలో విద్యుత్ సరఫరా కాకపోవడంతో పొలాలకు నీరు అందించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.



# పశుసంవర్ధక లక్ష్యాలు సకాలంలో పూర్తి

**జనగామ, సెప్టెంబర్ 10, :**

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పశుసంవర్ధక శాఖ కార్యక్రమాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ డిజిటల్ పశుసంపద కార్యక్రమం, భారత్ పశుధన్ అంతర్జాల వేదిక, రాష్ట్ర వార్షిక ప్రణాళిక పనితీరు, గిట్టుబాటు టీకాలు, కృత్రిమ గర్భధారణ, గర్భధారణ శాతం, పశుసంవర్ధక మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. భారత్ పశుధన్ అంతర్జాల వేదికలో పశుపాలకులు, పశువులు, పశుసంవర్ధక సంస్థలకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా ఆధార్, సెల్‌ఫోన్ నంబర్ వివరాల నవీకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. జిల్లాలో మొత్తం 40,219 మంది పశుపాలకులు నమోదై ఉండగా, వారిలో 15,487 మంది ఆధార్ వివరాలను నవీకరించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 5,033 మంది ఆధార్ వివరాలను నవీకరించినట్లు వెల్లడించారు. మిగిలిన పశుపాలకుల వివరాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పశువైద్య మౌలిక సదుపాయాల గుర్తింపు ప్రక్రియను జిల్లాలో వంద శాతం పూర్తి చేసినందుకు అధికారులను కలెక్టర్ అభినందించారు. జిల్లాలో మొత్తం 27 పశువైద్య సంస్థలు ఉండగా, వాటిలో 23 ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ పశువైద్య ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. అన్ని సంస్థలకు సంబంధించిన వివరాలను భారత్ పశుధన్ అంతర్జాల వేదికలో నమోదు చేసే ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. ఇదే విధంగా ఇతర కార్యక్రమాల్లోనూ లక్ష్యాలను సాధిస్తూ శాఖ పనితీరును మరింత మెరుగుపరచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పశుపాలకులకు అవసరమైన సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. 2026--27 సంవత్సరానికి జిల్లాలో 24,100 కృత్రిమ గర్భధారణలు నిర్వహించాలనే వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించినట్లు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 30 వరకు 8,033 కృత్రిమ గర్భధారణలు పూర్తి చేయాల్సిన లక్ష్యం ఉండగా, సెప్టెంబర్ 6 నాటికి 5,513 గర్భధారణలు నిర్వహించినట్లు వెల్లడించారు. జిల్లాకు రోజువారీ లక్ష్యం 110 కాగా, ప్రస్తుతం రోజుకు సగటున 112 కృత్రిమ గర్భధారణలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. గర్భధారణ శాతాన్ని మరింత మెరుగుపరిచేందుకు గర్భ నిర్ధారణ వివరాలను సకాలంలో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పశువుల ఉత్పాదకతను

# తెలంగాణలో సమస్యలపై హరీశ్ ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, :**

తెలంగాణలో నీరు, విద్యుత్, ఎరువుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా నీళ్ల కోసం ప్రజలు రోడ్డెక్కుతున్నారని, విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారని, యూరియా కోసం రైతులు చెప్పులు క్యూలో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పరిస్థితు లను తిరిగి తీసుకువస్తానని చెప్పారని, ఇప్పుడు నిజంగానే పాత రోజులను తీసుకొచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. రైతులకు సాగునీరు అందించ డంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని హరీశ్ రావు విమర్శించారు. సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్న సమయంలో ప్రభు త్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరా రు. రైతుల పొలాలకు నీరు అందేలా సాగునీటి మోటార్లను వెంటనే నడిపించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులు తమ సమస్యలపై ఆందోళనలకు దిగుతున్న పరిస్థితిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని సూచిం చారు. శాసనసభలో ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలను మార్షల్స్ ద్వారా అడ్డుకోవడం కంటే రైతులకు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. "మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం తెలంగాణ తాగునీరు, సాగునీటి ప్రయోజనాలకు శాపంగా మారుతోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటి సమస్యలు ఎదురవుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. తాగునీటి అవసరాలతో పాటు సాగునీటి కోసం ఎదురుచూ స్తున్న రైతుల పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. నీటి వనరుల నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని కోరారు. మరోవైపు విద్యుత్ సరఫరా, యూరియా లభ్యత విషయంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. విద్యుత్ కోసం రైతులు ఆందోళనలు చేయడం, యూరియా కోసం దీర్ఘకాలం వేచి చూడాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.



# మాతృత్వంపై సమంత ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

నటి సమంత జీవితంలో కొత్త దశను ఆస్వాదిస్తున్నట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరును వివాహం చేసుకున్న ఆమె త్వరలోనే తల్లిగా మారబోతున్నారనే వార్తలు ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచాయి. ఈ నేపథ్యంలో మాతృత్వం, మహిళల స్వతంత్ర నిర్ణయాలు, జీవితంలో రాబోయే మార్పులపై సమంత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా సెప్టెంబర్ సంచిక కవర్‌పై సమంత ఆకట్టుకున్నారు. విభిన్నమైన దుస్తుల్లో ఆమె చేసిన ఫొటోషూట్ అభిమానులను ఆకట్టుకోగా, ఇంటర్వ్యూలో మాతృత్వంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తల్లి కావడం మహిళ జీవితంలో పెద్ద మార్పును తీసుకొస్తుందని, ఆ కొత్త దశను స్వీకరిం చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సమంత పేర్కొన్నట్లు సమాచారం. తన జీవితంలో రాబోయే మార్పును సానుకూలంగా చూస్తున్నట్లు ఆమె తెలిపారు. తన భర్త రాజ్ నిడిమోరు తనపై ఎంతో నమ్మకం ఉంచుతారని, జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తనకు అండగా నిలుస్తారని సమంత చెప్పినట్లు తెలుస్తోంది. భాగస్వాముల మధ్య పరస్పర నమ్మకం, అవగాహన ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళల స్వతంత్ర నిర్ణయాలపైనా సమంత తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఉద్యోగం, వ్యక్తిగత బంధాలు, జీవిత లక్ష్యాలు వంటి విషయాల్లో మహిళలు తమకు నచ్చిన నిర్ణయాలను స్వయంగా తీసుకునే స్వేచ్ఛ ఉండాలని ఆమె పేర్కొన్నారు. తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాల కోసం మహిళలు ఇతరుల అనుమతి లేదా అంగీకారం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని సమంత అభిప్రాయపడ్డారు.





# కింగ్ ఆఫ్ కోథా ట్రోలింగ్‌పై ఐశ్వర్య లక్ష్మి ఆవేదన..

## ఆ ఆఫర్‌ను ఎందుకు తిరస్కరించారంటే?

పరిశ్రమలో ఒక్క విజయం నటీనటుల కెరీర్‌ను ఒక్కసారిగా మార్చేస్తుంది. అదే సమయంలో ఓ పరాజయం మాత్రం కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపైనా తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగిన ఈ రోజుల్లో సినిమా ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోతే నటీనటులపై జరిగే ట్రోలింగ్ మరింత తీవ్రంగా ఉంటోంది. తాజాగా హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తన కెరీర్‌లో ఎదుర్కొన్న అలాంటి చేదు అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. దుల్కర్ సల్మాన్ హీరోగా అభిలాష్ జోషి దర్శకత్వంలో తెరకెక్కిన 'కింగ్ ఆఫ్ కోథా' భారీ అంచనాలతో 2023లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సుమారు రూ.50 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. సినిమా ఫలితంతో పాటు చిత్రబృందం, నటీనటులపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు, ట్రోలింగ్ జరిగాయి. ఈ సినిమా పరాజయం తన కెరీర్‌పై మాత్రమే కాకుండా వ్యక్తిగత జీవితంపైనా ప్రభావం చూపిందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. ముఖ్యంగా సినిమాలో తన నటన, సంభాషణలు పలికిన విధానంపై వచ్చిన విమర్శలు తనను తీవ్రంగా బాధించాయని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల విమర్శలు నిజమేనేమోనని తానూ ని ఆమె వెల్లడించారు.

# శ్రీలీల ఫోకస్ బాలీవుడ్‌పై

**హైదరాబాద్, సెప్టెంబరు 10 :**

సినీ రంగంలో విజయాలు, పరాజయాల ప్రభావం కథానాయికల కెరీర్‌పై వేగంగా పడుతుంటుంది. ఒకప్పుడు వరుస అవకాశాలతో టాలీవుడ్‌లో దూసుకెళ్లిన శ్రీలీల.. ప్రస్తుతం కొత్త దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. డ్యాన్స్, గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఆమె.. అగ్ర కథానాయకుల సరసన వరుసగా నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయిందనే అభిప్రాయం ఉంది.

## ముంబైకి మకాం?

టాలీవుడ్‌లో అవకాశాలు కొంత తగ్గిన నేపథ్యంలో శ్రీలీల బాలీవుడ్‌పై దృష్టి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. వైద్య విద్యను పూర్తి చేసుకున్న ఆమె.. ఇక పూర్తిస్థాయిలో సినిమాలపై దృష్టి సారించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. బాలీవుడ్‌లో ఒకటి రెండు సినిమాలు చేయడం కాకుండా అక్కడే తన కెరీర్‌ను బలంగా నిర్మించుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ నుంచి ముంబైకి మకాం మార్చినట్లు, అక్కడ ఓ విలాసవంతమైన ఆస్తిని కూడా కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. హిందీ చిత్ర పరిశ్రమకు దగ్గరగా ఉండటం ద్వారా కొత్త కథలు, దర్శకులు, నిర్మాణ సంస్థలతో టచ్‌లో ఉండొచ్చని శ్రీలీల భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## కార్తీక్ ఆర్యన్‌తో ఎంట్రీ

బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తూ శ్రీలీల హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె ఆశిస్తున్నట్లు సమాచారం.



# హాలీవుడ్ థియేటర్లలో రామాయణ ప్రత్యేక ట్రైలర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

పురాణ కథను ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించేందుకు తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్ 1'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నితీష్ తివారి దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ విజువల్ ఎపిక్ కోసం భారతీయ ప్రేక్షకులతో పాటు విదేశీ సినీ అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఇంగ్లీష్ ట్రైలర్‌కు అంతర్జాతీయ స్థాయిలో మంచి స్పందన రావడంతో.. ఇప్పుడు చిత్రబృందం విదేశీ మార్కెట్లలో ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేసింది. తాజాగా హాలీవుడ్ థియేటర్లలో 'రామాయణ' ప్రత్యేక ట్రైలర్‌ను ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. కెనడాలోని మల్టీప్లెక్స్ థియేటర్లలో హాలీవుడ్ చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రదర్శన సందర్భంగా 'రామాయణ'కు సంబంధించిన సుమారు 1 నిమిషం 22 సెకన్ల ఇంగ్లీష్ ప్రత్యేక ట్రైలర్‌ను ప్రదర్శించినట్లు సమాచారం. భారీ తెరపై ఈ ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు తమ స్పందనలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో వీడియోలు వైరల్‌గా మారాయి. 'రామాయణ'ను కేవలం భారతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నట్లు చిత్రబృందం ఇప్పటికే స్పష్టం చేసింది. అందులో భాగంగానే ఇంగ్లీష్ ట్రైలర్, అంతర్జాతీయ ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోంది. థియేటర్లలో హాలీవుడ్ చిత్రాల ప్రదర్శన సమయంలో 'రామాయణ' ప్రత్యేక ట్రైలర్‌ను చూపించడం కూడా ఈ అంతర్జాతీయ ప్రచారంలో భాగంగానే కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణ ఉన్న సూపర్ హీరో చిత్రాన్ని చూసేందుకు వచ్చే ప్రేక్షకులకు భారతీయ పురాణ కథను పరిచయం చేయడం సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రైలర్‌లో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, రాకింగ్ స్టార్ యశ్ రావణాసురుడిగా, సాయి పల్లవి సీతాదేవిగా కనిపిస్తున్న తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



# సీడ్ గణపతి అందుకున్న విజయ్ దేవరకొండ..

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' బృందం నుంచి 'సీడ్ గణేశ్' (విత్తన గణపతి) ప్రతిమను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ పర్యావరణ పరిరక్షణపై కీలక పిలుపునిచ్చారు. మన నగరాన్ని కాలుష్యం బారిన పడకుండా కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ సురక్షితమైన మట్టి విగ్రహాలను, విత్తన విగ్రహాలను ఉపయోగించాలని ఆయన కోరారు. పండుగ ముగిసిన తర్వాత ఆ విగ్రహం ద్వారా ఒక మొక్క ఎదుగుతుందని, భక్తితో పాటు ప్రకృతిని కూడా కాపాడుకోవాలని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన ఈ పర్యావరణహిత కార్యక్రమానికి విజయ్ దేవరకొండ మద్దతు తెలిపారు. కాలుష్యం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కలు నాటడం కేవలం ఎంపిక కాదని, అది అవసరమని సంతోష్ కుమార్ అభిప్రాయపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ మానస పుత్రికగా పేర్కొనే హరితహారం స్ఫూర్తితో 2018లో ప్రారంభమైన గ్రీన్ ఇండియా ఛాలెంజ్.. మూడు మొక్కలు నాటాలి, వాటిని మూడేళ్లు పెంచాలి, మరో ముగ్గురిని నామినేట్ చేయాలి అనే ఫార్ములాతో కొనసాగుతోంది.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467